క్లుప్తంగా

నేడు పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

సింగరాయకొండ: పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. నియోజకవర్గంలోని ఆరు మండలాల విద్యార్థులకు మండల కేంద్రంలోని రైల్వేస్టేషన్ రోడ్డులో ఉన్న జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో పరీక్షా కేంద్రం ఏర్పాటు చేసినట్లు పరీక్షల నిర్వహణ అధికారి వల్లూరి రామారావు తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తామని, విద్యార్థులు 9 గంటల లోగా పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కేంద్రంలో తెలుగు 46 మంది, ఇంగ్లిష్ 33 మంది, హిందీ 16 మంది, లెక్కలు 203 మంది, సైన్స్ 105 మంది, సోషల్ 73 మంది, సంస్కృతం 4 రాయాల్సి ఉందన్నారు. పరీక్షలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆయన వివరించారు. పరీక్షలలో ఎటువంటి అవకతవకలు జరగకుండా గట్టి చర్యలు తీసుకున్నట్లు ఆయన తెలిపారు.

క్రీడలతో శారీరక ధృఢత్వం



విజేతలకు మెమెంటోలు అందజేత

సింగరాయకొండ: క్రీడలతో యువతలో శారీరక ధృఢత్వంతో పాటు నాయకత్వ లక్షణాలు అభివృద్ధి చెందుతాయని సింగరాయకొండ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సన్నెబోయిన శ్రీనివాసులు అన్నారు. మండలంలోని మూలగుంటపాడు పంచాయతీ లో డాక్టర్ శివరామిరెడ్డి నివాసం సమీపంలో శనివారం రాత్రి దేవిసీపుడ్స్ ప్రీమియర్ లీగ్–3 షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో విజేతలకు బహుమతుల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ విభాగాలలో విజేతలకు మెమెంటోలు పంపిణీ చేశారు. సన్నెబోయిన పెద్ద నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతులు



విజేతలుగా నిలిచిన చిన్నారులు

కనిగిరిరూరల్: గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో వేసవి విజ్ఞాన తరగతుల్లో భాగంగా ఆదివారం చిన్నారులకు, విద్యార్థులకు వివిధ రకాల కథల, వ్యాసరచనల, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. గ్రంథపాలకుడు ఎస్కే అహమ్మద్ షరీఫ్, హెచ్ఎంపాడు మండల సర్వేయర్ కాకర్ల రమణయ్య విద్యార్థులకు పుస్తకం చదవడంపై అవగాహన కల్పించారు. అనంతరం కథల, చిత్రలేఖనం పోటీల్లో విజేతలకు జస్వంత్‌రెడ్డి, మఫియా, భవిష్, ఎస్కే రీను, ఎం భవ్య, రూఫియా, మేఘనలకు కాకర్ల రమణయ్య ఆర్థిక సహకారంతో ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.

తీరంలో అనుమానితుల సమాచారం తెలపండి



మత్స్యకారులతో మాట్లాడుతున్న మెరైన్ ఎస్సై మస్తాన్ షరీఫ్

సింగరాయకొండ: పాకల సముద్రతీరంలో అనుమానితులు సంచరిస్తుంటే వారి వివరాలను వెంటనే తెలపాలని రామాయపట్నం మెరైన్ ఎస్సై షేక్ మస్తాన్ షరీఫ్ మత్స్యకారులకు విజ్ఞప్తి చేశారు. పాకల పంచాయతీలోని చెల్లెమ్మగారి పట్టపుపాలెంలో ఆదివారం రాత్రి పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఎస్సై షరీఫ్ మాట్లాడుతూ భారత, పాకిస్తాన్ యుద్ధం నేపథ్యంలో సముద్రతీరంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. కొత్త వ్యక్తుల కదలికల్ని గమనిస్తుండాలని, అనుమానితుల సమాచారాన్ని టోల్ ఫ్రీ నంబర్ 1093కు తెలపాలని మత్స్యకారులకు విజ్ఞప్తి చేశారు. కానిస్టేబుల్ సన్యాసిరావు, మత్యకారులు పాల్గొన్నారు.

పాకల తీరంలో యథేచ్ఛగా కోడిపందేలు

సింగరాయకొండ: మండలంలోని పాకల సముద్రతీరంలో గంటల తరబడి లక్షల్లో కోడిపందేలు యథేచ్ఛగా సాగుతున్నాయి. కానీ పోలీసులకు మాత్రం అవేమీ పట్టడం లేదని ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఒక పక్క పోలీసులు కోడిపందేలు ఆడిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పడం తప్ప అడ్డుకున్న దాఖలాలు లేవు. పాకల తీరంలో ప్రతి ఆదివారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు కోడిపందేలు సాగుతున్నాయి. పోటీలకు జిల్లాతో పాటు నెల్లూరు, బాపట్ల జిల్లాకు చెందిన పందెంరాయుళ్లు భారీగా వస్తున్నారని ఆ ప్రాంత ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇటీవల వరకు మోటారుసైకిళ్లు వేసుకుని వచ్చేవారని, ప్రస్తుతం కార్లు కూడా వేసుకుని వస్తున్నారని, దీన్ని బట్టి పందేలు ఏ స్థాయిలో జరుగుతున్నాయో అర్థం చేసుకోవచ్చని స్థానికులంటున్నారు. ఈ విషయమై పోలీసులకు సమాచారం ఇచ్చినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు పేర్కొంటున్నారు. కోడి పందేల వద్దే మద్యం అమ్మకాలు, తినుబండారాల వ్యాపారం కూడా జోరుగా సాగుతోంది. ఇటీవల డ్రోన్ల సాయంతో అసాంఘిక కార్యకలాపాలను అడ్డుకుంటామని పోలీసులు ఆర్భాటంగా ప్రకటనలు ఇవ్వడమే గానీ, బహిరంగంగా కోడి పందేలు జరుగుతున్నా పట్టించుకోకపోవడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



కొండపి విద్యుత్ సబ్ స్టేషన్



రాత్రి కరెంటు పోవడంతో టార్చ్‌లైట్ తో దుకాణాన్ని నడిపిస్తున్న కిరాణా షాప్ యజమానులు

కరెంటు కట్ కట

- అప్రకటిత విద్యుత్ కోతలతో ప్రజలకు అవస్థలు
- వ్యాపారాలు సాగడం లేదని దుకాణదారుల ఆవేదన
- ఎడాపెడా కోతలతో ప్రజల ఆగ్రహం

కొండపి:

మండలంలో తరుచూ విద్యుత్ కోతలతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. విద్యుత్ ఏ సమయంలో ఉంటుందో, ఉండదో తెలియక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండల కేంద్రమైన కొండపిలో, కట్టవారిపాలెం తదితర గ్రామాల్లో వారం రోజులుగా విద్యుత్ సరఫరాలో అంతరాలతో ప్రజలకు ఇక్కట్లు తప్పడం లేదు. రాత్రిళ్లు కోతలు ఎక్కువగా ఉండటంతో చంటి పిల్లల తల్లుల అవస్థలు చెప్పేవి కావు.

రాత్రిళ్లు దోమల బెడద...

ఇటీవల అడపాదడపా వర్షాలు కురవడంతో రాత్రిళ్లు కూడా విద్యుత్ సరఫరా లేకపోవడంతో చిన్నారులతో పాటు అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వేసవి కాలం కావడంతో ఉక్కపోతతో పాటు, దోమలు బెడద ఎక్కువగా ఉంటుంది. ప్రతిరోజు ఒక సమయం అంటూ లేకుండా ఎప్పుడు పడితే అప్పుడు విద్యుత్ కోతలే ఎక్కువగా ఉండటంతో ఇబ్బందులు పడుతున్నారు. కోతలపై స్థానిక అధికారులను సంప్రదించినా స్పష్టమైన సమాచారం ఇచ్చేవారే కరువయ్యారు.

గాలివానకు గంటల తరబడి..

మండలంలో చిన్నపాటి ఉరుములు గాలి వాన వచ్చిన వెంటనే అధికారులు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నారు. ఆ తరువాత మూడు నాలుగు గంటలైనా విద్యుత్ సరఫరాను పునరుద్ధరించడం లేదు. విద్యుత్ అధికారులు సంప్రదించిన సబ్ స్టేషన్‌లో మరమ్మతులు, గాలివానకు విద్యుత్ తీగులు తెగిపడ్డాయి..అని ఏదో ఒక కారణం చెప్పడంతో ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. గత శుక్రవారం తెల్లవారుజామున ఉరుములతో కూడిన వర్షం పడడంతో తెల్లవారుజామున 2:30 నుంచి ఉదయం 9 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. దీంతో వృద్ధులు, చిన్నపిల్లలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.



సెల్‌ఫోన్ లైట్ల వెలుతురులో దుకాణం

అందరికీ ఇబ్బందే..

విద్యుత్ కోతలతో దుకాణదారులు, ఇంటర్నెట్ పాయింట్ నిర్వాహకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం ఎంసెట్, డీఎస్సీ, ఇతర పరీక్షలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు గ్రామాల నుంచి ఉదయాన్నే మండల కేంద్రమైన కొండపి వస్తుంటారు. కానీ కరెంట్ లేకపోవడంతో వీరంతా గంటల తరబడి ఎదురుచూడాల్సి వస్తోంది.

గత ప్రభుత్వంలో 24 గంటలు విద్యుత్ సరఫరా

2019–24 వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో 24 గంటలు విద్యుత్ సరఫరా అందుబాటులో ఉండేది. పెద్ద ఈదురుగాలులు, భారీ వర్షాలు పడిన సమయాలలో కూడా సిబ్బంది వెంటనే అప్రమత్తం చేసి గంట వ్యవధిలోని విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారని, ఇప్పుడు చిన్న గాలి కొడుతూనే మూడు నుంచి నాలుగు గంటల వరకు విద్యుత్‌ను నిలిపివేస్తున్నారు.

☛ ఇటీవల జరిగిన మండల సమావేశంలో విద్యుత్ శాఖాధికారులు మాట్లాడుతున్న సమయంలో ఎంపీడీఓ రామాంజనేయులు కలుగజేసుకొని వర్షాల సమయంలో ఎక్కువ సమయం విద్యుత్ కోతలు లేకుండా చూడాలని చెప్పడాన్ని బట్టి..కోతలు ఏ విధంగా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు.

కూటమి ప్రభుత్వంలో అన్నీ కోతలే:



వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో కోతలు లేవు. కూటమి ప్రభుత్వంలో ఎక్కడా లేని విధంగా కరెంటు కోతలు పెరిగిపోయాయి. ఎడాపెడా కోతలతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం వల్ల అన్ని వర్గాల వారు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు కోతలు లేకుండా చర్యలు చేపట్టాలి.

– వై వసంతరావు, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు

విద్యుత్ ఎప్పుడు తీస్తున్నారో కూడా అర్థం కావడం లేదు.



విద్యుత్‌ను ఎప్పుడు తీస్తారో అర్థం కావడం లేదు. ఎండలో ఉక్కపోతలకు పనులు నిమిత్తం బయటకు వచ్చే సందర్భాల్లో సేద తీర్చుకోవడానికి శీతల పానీయాల దుకాణాల వైపు వెళితే కూలింగ్ లేదని చెప్తున్నారు. రాత్రిళ్లు కరెంట్ పోవడంతో దోమల బెడదతో చిన్నపిల్లలు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారు. కరెంటు కోతలు లేకుండా చూడాలి.

-కె.మధు స్థానికుడు

గిట్టుబాటు ధరల కల్పనలో ప్రభుత్వాలు విఫలం

కనిగిరిరూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతు వ్యతిరేక పాలన సాగిస్తున్నాయని సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వై రవీంద్రబాబు, సయ్యద్ యాసీన్ అన్నారు. పట్టణంలోని హనీఫ్ నగర్‌లో, మండలంలోని ఏరువారిపల్లిలో ఆదివారం సీపీఐ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సయ్యద్ షరీఫ్, డీకాల దేవదాసుల అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీపీఐ జిల్లా నాయకుడు వై రవీంద్రబాబు మాట్లాడుతూ ప్రభుత్వాలు రైతులను ఆదుకోవడంలో తీవ్రంగా విఫలం చెందాయన్నారు. కనీస గిట్టుబాటు ధరలు లేక అల్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మిర్చి, పొగాకు రైతులు ప్రతి రోజు రోడ్డెక్కి నిరసనలు తెలుపుతున్నా ప్రభుత్వం కనీసం స్పందించకపోవడంపై మండిపడ్డారు. పొగాకు రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని, మిర్చిరైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ యాసీన్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ కార్మిక చట్టాలను కాల రాస్తోందన్నారు. పశ్చిమ ప్రాంత ప్రజల ఆశాజ్యోతి అయిన వెలిగొండ ప్రాజెక్టుకు నిధులు కేటాయించి త్వరగా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలపై పోరాటాలకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని పిలుపు నిచ్చారు. అనంతరం నూతన కమిటీలను ఎన్నుకున్నారు. తొలుత హనీఫ్ స్థూపం వద్ద సయ్యద్ రాబియాబి జెండా ఆవిష్కరణ చేశారు. సీపీఐ, వివిధ సంఘాల నాయకులు జీపీ రామారావు, పందిటి మోహన్, సయ్యద్ జిలానీ, ఎస్‌డీ మౌలాలి, ఖాదర్ మస్తాన్, ఎస్‌డీ షరీఫ్, సయ్యద్ అమ్రూల్లా, ఇమామ్ హుస్సేన్, ఖాశింపీరా, తాజు, పుట్టా సుబ్బారావు, పవన్ కళ్యాణ్, పూర్ణ చంద్రరాజు తదితరులు పాల్గొన్నారు. తొలుత అమరవీరుల స్థూపాల వద్ద జెండా ఆవిష్కరణలు చేశారు. ప్రజానాట్యమండలి కళాకారులు ఆలపించిన విప్లవ గేయాలు ఆహూతులను అలరించాయి.



జెండా ఆవిష్కరణలో వై రవీంద్రబాబు, పార్టీ నేతలు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



చదువు చెప్పిన గురువులతో పూర్వ విద్యార్థులు



మర్రిపూడి: ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

పీసీపల్లి: స్థానిక పీసీపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓలు సంజీవ్, శ్రీనివాసాచారి మాట్లాడుతూ 1999–2000 పూర్వ విద్యార్థులు పాఠశాల అభివృద్ధి కోసం సుమారు రూ.2 లక్షలు ఖర్చుచేసి భోజనశాల ఏర్పాటు చేశారన్నారు. చదువుకున్న పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థుల కృషిని కొనియాడారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకొని ఆనాటి సంగతులను నెమరువేసుకున్నారు. కార్యక్రమంలో మాల కొండారెడ్డి, సజ్జల వెంకటేశ్వర్లు, గల్లా చెన్నయ్య, డేగ ఆంజనేయులు, వెంకటేశ్వర్‌రెడ్డి, గోపవరపు కృష్ణారెడ్డి, రాఘవరెడ్డి, కవిత, రత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

మర్రిపూడిలో..

మర్రిపూడి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో 2004–05లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం ఆనందోత్సవాల మధ్య నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. ప్రధానోపాధ్యాయుడు ఎం వెంకటరెడ్డి మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు 21 ఏళ్ల తర్వాత కలుసుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఒకరినొకరు సాయం చేసుకుంటూ ముందుకు సాగాలన్నారు. ఆత్మీయ సమ్మేళనానికి కాకరులైన రాణి, దారుకుమల్లి వీరనారాయణరెడ్డి, కొండూరి సుధాకరరెడ్డి, ఉప్పు సాయిబాబులను అభినందించారు. ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ గత స్మృతులను నెమరు వేసుకున్నారు.

సేవా కార్యక్రమాలు విస్తృతం చేద్దాం



సుందరయ్యకు నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

కొండపి: ప్రజా ఉద్యమాలతో పాటు ప్రజా సేవా కార్యక్రమాలు విస్తృతం చేయాలని, అదే సుందరయ్యకు మనం ఇచ్చే నివాళి అని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎస్కే మాబు అన్నారు. సుందరయ్య 40వ వర్ధంతి సందర్భంగా మండలంలోని పెరిదేపిలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. సీపీఎం మండల కార్యదర్శి మండల కొండయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ సుందరయ్య జీవితం నేటి తరానికి ఆదర్శం కావాలన్నారు. సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కంకణాల ఆంజనేయులు, సీపీఎం జిల్లా నాయకుడు కేజీ మస్తాన్, భగత్ సింగ్ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ సభ్యులు వెంకటేశ్వర్లు, ఆశీర్వాదం, ప్రభుదాస్, థామస్, దావీదు, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అభిషేకోత్సవం, గోపూజ

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం మిట్టపాలెం నారాయణస్వామి ఆలయంలో ఆదివారం నారాయణస్వామికి అభిషేకోత్సవం అర్చకులు శ్రీమంకాల శివప్రసాద్ వేదమంత్రాలతో ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణలోని గోశాలలో గోపూజ నిర్వహించారు. అనంతరం మహానైవేద్యంతో వేడుకగా భజంత్రీల మేళతాళాల నడుమ ఆలయ ప్రదక్షిణ చేసి స్వామికి నైవేద్యంగా సమర్పించారు. దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ ఈఓ శ్రీగిరిరాజు నరసింహబాబు, చైర్మన్ కొమ్మినేని చిన్న ఆదినారాయణ, కొమ్మినేని వెంకట్రావు, భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

రూ.10 లక్షల విలువైన తెల్లరాయి పట్టివేత



తెల్లరాయిని పట్టుకున్న ఫారెస్ట్ అధికారులు

కనిగిరిరూరల్: కనిగిరి– వెలిగండ్ల మండలాల మధ్యలో ఉన్న నల్లగొండ రిజర్వు ఫారెస్ట్ పరిధిలోని అక్రమంగా నిల్వ చేసి ఉన్న తెల్లరాయిని ఫారెస్ట్ అధికారులు పట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే..మండల శివారు ప్రాంతమైన జమ్ములమడ గ్రామ కొండ పొలాల్లో, నాగిరెడ్డిపల్లి ఫారెస్ట్ బీట్‌లో కొందరు వ్యక్తులు రిజర్వు ఫారెస్ట్ భూముల్లో తెల్లరాయిని తవ్వకాలు చేస్తున్నారు. మణికంఠ అనే వ్యక్తి ఆదేశాల మేరకు సుమారు ఆరుగురు వ్యక్తులు భారీ పొక్లెయిన్ వాహనంతో తవ్వకాలు చేసినట్లు తెలిసింది. అయితే కొంత తెల్లరాయిని ఈ ప్రాంతాల నుంచి ఇక్కడికి తరలించి ముక్కలు చేస్తున్నట్లు తవ్వకదారులు అధికారులకు వెల్లడించారు. ప్రస్తుతం తెల్లరాయి ఉన్న ప్రదేశం, తవ్వకాలు చేసిన ప్రదేశం రెండు నల్లగొండ రిజర్వుఫారెస్ట్ పరిధిలో ఉండటంతో ఫారెస్ట్ అధికారులు అక్కడ పనులు చేస్తున్న ఆరుగురిని, పొక్లెయిన్ ఆపరేటర్‌ను పట్టుకుని బైండోవర్ చేశారు. ఈ తెల్లరాయి విలువ సుమారు రూ.10లక్షల వరకు ఉంటుందని సమాచారం. దాడుల్లో ఇన్‌చార్జి ఎఫ్ఆర్ఓ ఒంగోలు బి. నర్సింహారావు, ఫారెస్ట్ ఎస్ఏ, కనిగిరి సెక్షన్ అధికారి అలీం, జేఓ వెంకటేశ్వర్లు, సీఎస్‌పురం ఎఫ్ఎస్ఓ నర్సింహం, ఎఫ్‌బీఓ కనిగిరి బషీర్ తదితరులున్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్టా మహోత్సవం



ప్రతిష్టా పూజల్లో దద్దాల, నేతలు

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని బాలుపల్లిలో నూతనంగా నిర్మించిన వెంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి, అమ్మవార్ల విగ్రహ ప్రతిష్టా మహోత్సవం ఆదివారం రుత్వికుల వేదమంత్రాల నడుమ వైభవంగా నిర్వహించారు. అర్చకులు పంచాగ్నుల రామమూర్తి ఆధ్వర్యంలో వేదమంత్రాల నడుమ యంత్ర ప్రతిష్ట అనంతరం విగ్రహ ప్రతిష్టా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం శాంతి కల్యాణం నిర్వహించారు. ప్రత్యేక పూజల్లో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ దద్దాల నారాయణయాదవ్, నాయకులు పాల్గొన్నారు. దద్దాలను, స్థానిక నాయకులను ఆలయ కమిటీ ఘనంగా సన్మానించింది. జెడ్పీటీసీ మేకల శ్రీనివాసులు, వైస్ ఎంపీపీ దుగ్గిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు పొలుగుళ్ల మల్లికార్జున రెడ్డి, పార్టీ టీయూసీ జిల్లా అధ్యక్షుడు మితికాల గురవయ్య, ఎంపీటీసీ బైరెడ్డి తిరుపతిరెడ్డి, సర్పంచ్ బొట్లా చిరంజీవి, మేకల బాలుయాదవ్, బొర్రాజు రమణయ్య, బోగల బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యతో పాటు క్రీడల్లోనూ సత్తా చాటాలి



క్రికెట్‌పోటీలను ప్రారంభిస్తున్న ముత్యాల నారాయణరెడ్డి

సీఎస్‌పురం(పామూరు): విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ సత్తా చాటాలని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల నారాయణరెడ్డి అన్నారు. మండలంలోని అయ్యలూరివారిపల్లె లో గ్రామ యూత్‌ఫోర్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్రికెట్ టోర్నమెంట్ పోటీలను ముత్యాల నారాయణరెడ్డి స్థానికులతో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు యువకుల మధ్య స్నేహభావాన్ని పెంపొందిస్తాయన్నారు. పామూరు, సీఎస్‌పురం మండలాలు, నెల్లూరుజిల్లా పరిదిలోని సీతారాంపురం మొత్తం 3 మండలాల స్థాయిలో ఈక్రికెట్ పోటీలు నిర్వహిస్తుండగా 28 జట్లు తమ పేర్లను నమోదు చేసుకున్నాయి. ప్రారంభమ్యాచ్‌లో బసినేనిపల్లి జట్టుపై సీతారాంపురం జట్టు విజయం సాధించింది. కార్యక్రమంలో పెద్దిరెడ్డి రామిరెడ్డి, ఎస్. శివారెడ్డి, పి.శివరామకృష్ణ, ఎల్.వెంకటేశ్వర్లు, జి.గురుబ్రహ్మం, పి.లక్ష్మీనారాయణరెడ్డి, డి.సురేంద్ర, సీహెచ్.దుగ్గయ్య, కే.వెంకటేష్‌రెడ్డి, వాసు, నిర్వాహకులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటించాలి



పొన్నలూరులో వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్సై అనూక్

పొన్నలూరు: ఆటోడ్రైవర్లు నిబంధనలు మేరకు పరిమిత సంఖ్యలో ప్రయాణికులను ఎక్కించాలని ఎస్సై అనూక్ అన్నారు. పొన్నలూరులో ఆదివారం రోడ్డు భద్రత నియమాలు, హెల్మెట్ వినియోగంపై వాహనదారులకు కౌన్సెలింగ్ నిర్వహించి లైసెన్స్, హెల్మెట్ లేని వారికి ఈ–చలాన ద్వారా జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మైనర్లు వాహనాలు నడపరాదని, ఒకవేళ ఎవరైనా బైక్‌లు, వాహనాలు నడుపుతూ పట్టుబడితే వారితో పాటు తల్లిదండ్రులపై చర్యలు తీసుకుంటామన్నారు. బైక్ నడిపేటప్పుడు హెల్మెట్ ధరించడం వల్ల ప్రమాదం జరిగినప్పుడు విలువైన ప్రాణాలు రక్షించుకోవచ్చన్నారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడితే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలన్నారు.

గంగా భవానీ తిరునాళ్ల ప్రారంభం



ప్రత్యేక అలంకరణలో గంగాభవానీ మూలవిగ్రహమూర్తి, బొల్లావులు



తిరునాళ్లకు ముస్తాబైన గంగాభవానీ ఆలయం

పామూరు: మండలంలోని మోపాడు రిజర్వాయరు వద్ద ఉన్న గంగాభవానీ ఆలయంలో గంగాభవానీ అమ్మవారి తిరునాళ్ల ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా అర్చకులు గంగాభవాని మూల విగ్రహమూర్తికి పంచామృతాభిషేకం, చందనాభిషేకం, కుంకుమాభిషేకం నిర్వహించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. తిరునాళ్ల సందర్భంగా అమ్మవారిని, బొల్లావులను ప్రత్యేకంగా తీర్చిదిద్దారు. ఆలయాన్ని ప్రత్యేక విద్యుద్దీపాలంకరణలో శోభాయమానంగా అలంకరించారు. భక్తులు పూజల్లో పెద్దసంఖ్యలో పాల్గొనగా దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

బాబా ఆలయంలో ముగిసిన కుంభాభిషేకం



ప్రత్యేక పూజల్లో మున్సిపల్‌చైర్మన్ గఫార్, దేవకి వెంకటేశ్వర్లు

కనిగిరిరూరల్: స్థానిక సాయిబాబా దేవస్థానంలో మూడు రోజులుగా జరుగుతున్న మహా కుంభాభిషేకం ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆలయంలో పెనుగొండ క్షేత్ర పీఠాధిపతి పరమజ్యోతి ప్రజ్ఞానంద సరస్వతీ విశిష్ట పూజలు చేశారు. అనంతరం దేవాలయంలోని దేవతామూర్తులకు మహా గణపతి, దత్తాత్రేయుడు, షిర్డీ సాయి బాబా, సుబ్రహ్మణ్యస్వామి విగ్రహ మూర్తులకు ప్రత్యేక పూజలు జరిగాయి. కార్యక్రమంలో ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్, వాసవీసత్ర సముదాయాల జాతీయ అధ్యక్షుడు దేవకి వెంకటేశ్వర్లు, కేటీఆర్ విద్యా సంస్థల అధినేత కుందురు తిరుపతిరెడ్డి, ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు కొప్పరపు సత్యాలు, బాలు ఓబుల్‌రెడ్డి, ముచ్చర్ల ధర్మారావు, కమిటీ నాయకులు పాల్గొన్నారు.